క్లుప్తంగా

దరఖాస్తులకు ఆహ్వానం

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం బాలుర ఎస్సీ హాస్టల్‌లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ విక్రమ్ శుక్రవారం విలేకర్లతో చెప్పారు. ఆయన మాట్లాడుతూ 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు హాస్టల్‌లో సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సహితం సీట్లు ఉన్నాయని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం స్వచ్ఛమైన పౌష్టికాహారంతో కూడిన భోజనం, దుస్తులు, బ్యాగులు, నోట్‌పుస్తకాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులు వయసుకు తగ్గట్టు బరువు ఉండాలి



శేరికుంటతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఎత్తు పరిశీలిస్తున్న సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారులు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలని చిలప్‌చెడ్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శుక్రవారం మండలంలోని శేరికుంట తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో 5 సంవత్సరాల లోపు చిన్నారుల ఎత్తు, బరువుపై ప్రత్యేక కార్యక్రమంతో పాటు, అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా మూడేళ్లు పూర్తయిన చిన్నారులను అంగన్‌వాడీ చేర్పించాలంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత మాట్లాడుతూ.. తల్లులు తమ పిల్లలను ఎదుగుదల ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ఎదుగుదలకు తాము సూచించిన పోషకాహారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.


భగీరథ నీటి వసతిపై ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మిషన్ భగీరథ నీటి సౌకర్యాలపై ఇంటింటి సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతీ ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి యజమాని ఫొటోతో పాటు భగీరథ నల్లా ఫొటో తీసుకోవాలన్నారు. భగీరథ నీళ్లు సక్రమంగా వస్తున్నాయో, లేదో కనుక్కోవడంతో పాటు, వచ్చే నీళ్లు సరిపోతున్నాయో, లేదో తెలుసుకొని భగీరథ యాప్‌లో ఎంటర్ చేయాలన్నారు. ప్రజలకు భగీరథ నీరు అందించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 10 నుంచి పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలన్నారు.

ఘనంగా మైసమ్మ పండుగ



అమ్మవారి ఊరేగింపులో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): పట్టణ శివారులోని గురుపాదగుట్ట వద్ద ఉన్న ఆలయంలో మైసమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారికి చావిడి వద్ద నుంచి ఊరేగింపుగా బాజభజంత్రీలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ బాగుండాలని మొక్కుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

హరీశ్‌రావును విమర్శించడం సరికాదు

శివ్వంపేట(నర్సాపూర్): సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుని కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంత్‌రావు విమర్శించడంపై బీఆర్‌ఎస్ నాయకులు ఖండించారు. మండల పరిధిలోని గూడూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గొల్ల యాదగిరి, హన్మంతు, బ్యాగరి యాదగిరి శుక్రవారం మాట్లాడుతూ.. మైనంపల్లి రాష్ట్రంలోని పలు చోట్ల భూములు కబ్జాలకు పాల్పడిన సంగతి అందరికి తెలిసిందేన్నారు. ప్రజాసేవలో ఉన్న హరీశ్‌రావుని విమర్శించడం మంచిదికాదన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

● ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



పాపన్నపేట(మెదక్): మాట్లాడుతున్న ఎంఈఓ నీలకంఠం



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో ..



కొడిపల్లి(నర్సాపూర్): దేవులపల్లిలో..



శివ్వంపేటలో ..



కొడిపల్లిలో..

పాపన్నపేట(మెదక్): బడి బయట పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పిలుపు నిచ్చారు. శుక్రవారం పాపన్నపేటలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడీడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని అన్నారు. బాల కార్మికులుగా మారిస్తే సంబంధీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎస్‌ఐ నరేశ్ మాట్లాడుతూ.. బాల్యం ఆటపాటలతో, చదువులతో గడవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. ఎంఈఓ నీలకంఠం మాట్లాడుతూ.. బడీడు కన్నా ముందు పిల్లలను అంగన్ వాడీలకు పంపాలని, అనంతరం ఐదేళ్లు వచ్చిన తర్వాత బడికి పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, 2 జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. సమాజంలోని ప్రతీ పౌరుడు తన బాధ్యతగా, పిల్లలను పాఠశాలకు పంపాలని సూచించారు. అమ్మఒడి కమిటీలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపు నిచ్చారు. వారం రోజుల పాటు జరిగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి

చిలప్‌చెడ్(నర్సాపూర్): బడీడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని చిట్కుల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో ఆయన తోటి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులతో కలిసి బడిబాట కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, భోజనం, యూనిఫామ్స్‌తో పాటు, నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని వడ్డెర కాలనీలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటరాములు, హెచ్‌ఎం మారుతి, ఉపాధ్యాయులు సంతోష్, హన్మండ్లు, సిద్ధిరాములు, సంతోష్, దయానంద్, సుధీర్ తదితరులున్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష అన్నారు. మండల కేంద్రం శివ్వంపేటలో బడిబాట ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ.. ఆటపాటలతో చిన్నారులకు విద్యా బోధనతో పాటు పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్నారని అన్నారు. ప్రతీ టీచర్ గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి మూడేళ్లు నిండిన వారందరిని కేంద్రాల్లో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు కృష్ణవేణి, నవీన ఉన్నారు.

సర్కారీ బడుల్లోనే నాణ్యమైన విద్య

వెల్దుర్తి(తూప్రాన్): సర్కారి బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విఘ్నేశ్వర్ పిలుపునిచ్చారు. బడిబాటలో భాగంగా మండలంలోని హస్తాల్‌పూర్, గంగిరెద్దుల వాడలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. సర్కారు బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శశికళ తెలిపారు. అంగన్‌వాడీ బాడిబాటలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం కొడిపల్లిలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని చెప్పారు. ఆట పాటలతో విద్యనేర్పడంతో పాటు పౌష్టికాహారం పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, కమల, సుమిత్ర, నిర్మల, రజియా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



నర్సాపూర్‌లోని ఓ విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు



తూప్రాన్‌లో ఎరువుల దుకాణాంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు



పాపన్నపేటలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ అధికారులు విత్తన డీలర్లను హెచ్చరించారు. మండల టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందంలోని ఏఓ రాజశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని పలు విత్తన డీలర్ల దుకాణాలలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, ప్రతీ రైతుకు బిల్లు తప్పకుండా ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాకు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

రశీదు తప్పనిసరి

పాపన్నపేట(మెదక్): కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరేష్, వ్యవసాయాధికారి కృష్ణ హెచ్చరించారు. పాపన్నపేటలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ప్రతీరోజు విత్తన క్రయ, విక్రయాల రిజిస్టర్లు రాయాలన్నారు. రైతులు విత్తన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఇఓలు జనార్దన్, డీలర్లు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

హవేళిఘణాపూర్(మెదక్): కల్తీవిత్తనాలు విక్రయించిన దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ నాగమాధురి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు కల్తీ విత్తనాల ద్వారా మోసపోకుండా ఉండేందుకు అవగాహన అవసరమన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను పోలీసులు, వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, విత్తనాల నాణ్యత ప్రమాణాలు, రికార్డులను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ శివానందం, మండల వ్యవసాయాధికారి గంగుమలు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్



సమావేశానికి సభ్యులు రాక ఖాళీగా కుర్చీలు

కొడిపల్లి(నర్సాపూర్): మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులు రాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. శుక్రవారం కొడిపల్లి మండల సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించేందుకు ఎంపీడీఓ శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు. ఎంపీడీఓతో పాటు పీఆర్‌ఏఈ ప్రభాకర్, ఏఓ స్వప్న, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి, పశువైద్యాధికారి రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఇతర అధికారులు హాజరుయ్యారు. ఎంపీపీ దలావత్ రాజునాయక్ చిన్నాన్న మృతి చెందడంతో అతను సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదు. మిగతా ఎంపీటీసీ సభ్యులు ఎవరుకూడా సమావేశానికి రాలేదు. దీంతో గంట పాటు వేచి చూసి సభ్యులు రానందున సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్: వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. ఆయన శుక్రవారం పట్టణంలోని 8వ వార్డు కౌన్సిలర్ రాంచందర్‌తో కలిసి వార్డులో పర్యటించారు. వార్డులో వీధి దీపాలు, మురికి కాలువల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర పనులను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలు తమ ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కాగా మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి మురికి నీరు, వర్షం నీరు నిలువకుండా వెళ్లిపోయేలా చూడాలని సూచించారు. వార్డు సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట కౌన్సిలర్ రాంచందర్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు /జ్ఞానేశ్వర్, బాల్‌రాజ్, మున్సిపాలిటీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మురళీ, వార్డు ఆఫీసర్లు ఉదయ్, రాములు, రన్‌దీప్ తదితరులు ఉన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

● మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

కౌల్దారం(నర్సాపూర్): రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని మండల సాధారణ సమావేశంలో ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఇప్పటికీ మండలంలో రైతులకు అవసరమైన జీలుగ, జనుము విత్తనాలు డిమాండ్ మేరకు పూర్తిస్థాయిలో అందుబాటు లేకపోవడంపై ఏఓ శ్వేతను ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ.. సన్నరకం వరి పంట సాగు చేసే రైతులు ఇప్పటికే పనులు మొదలు పెట్టారని, ఆలస్యంగా విత్తనాలు ఇస్తే లాభం ఏమిటని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు ఇబ్బందిగా ఉన్న చోట్ల నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు బోర్లను అద్దెకు తీసుకొని నీటిని సరఫరా చేసామన్నారు. ట్రాన్స్‌కో ఏఈ మహమూద్ మాట్లాడుతూ.. గత నెల గాలి దుమారంతో మండలంలో 146 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని, పునరుద్ధరణ పనులు చేపట్టామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా గ్రామస్థాయి ప్రత్యేక అధికారులు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుబంధంగా చేస్తూ ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో కల్యాణలక్ష్మి కింద ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 40 మంది లబ్ధిదారులకు చెక్కులు వచ్చాయన్నారు. త్వరలోనే వాటిని అందిస్తామని డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు, సూపరింటెండెంట్ విఠల్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు ఉదయ వేమారెడ్డి, కోఆప్షన్ నెంబర్ మౌలానా, ఎంపీటీసీలు భాగ్యలక్ష్మి, మమత, ఎల్లయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసంస్థ నూతన కార్యవర్గం



నియోజకవర్గ బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ నియోజకవర్గ బ్రాహ్మణ సమాజ సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కిషన్‌రావు దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా కృష్ణశర్మ, పేట మండలాధ్యక్షుడిగా రామచంద్రాచారి, ప్రధాన కార్యదర్శిగా రాము, గౌరవాధ్యక్షుడిగా చంద్రశేఖరశర్మ, ఉపాధ్యక్షులుగా అనంత్‌రాజ్, సీతారాం, సహాయ కార్యదర్శులుగా సంతోష్, గిరి, సలహా దారులుగా రామాచారి, అభిలాష్, కోశాధికారి రవి, సంయుక్త కార్యదర్శులుగా మహేశ్, క్రాంతిలాల్, ఫణి, జగన్నాథ్‌రావు, మహిళా అధ్యక్షురాలిగా వాసుకి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్మయి, గౌరవ అధ్యక్షురాలిగా లక్ష్మీరేఖ, ఉపాధ్యక్షురాలిగా విద్య, శ్రీవేణి, హేమలత, సుజాత ఎన్నికయ్యారు. ఖేడ్ అధ్యక్షుడు సతీష్, కంగ్టి అధ్యక్షుడు వెంకటరావు, శంకర్‌రావు, సుధాకర్ రావు, నాగరాజశర్మ, గిరిధర్ తదితరులున్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ టీం సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): భార్గవ్ ఆర్యన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో దివ్యాంగులకు రెండు వీల్‌చైర్లను అందించినట్లు సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఖాజాపూర్‌తండా, గజగట్లపల్లి గ్రామాలకు చెందిన దివ్యాంగులకు రెండు విల్‌చైర్‌లను అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామీణ నిరుపేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన ఇతర ఫౌండేషన్‌లతో కలిసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గజగట్లపల్లి, ఖాజాపూర్ తండాకు చెందిన ఇద్దరు ఏ బాలురకు అత్యవసరంగా విల్‌చైర్ అవసరమని తెలుసుకొని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ టీమ్ సభ్యులు మహేశ్, భాను, సూర్య, ప్రకాష్, సురేశ్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై కేబుల్‌వైరు తొలగించండి

చిన్నశంకరంపేట(మెదక్): నెల రోజుల క్రితం ఆకాల వర్షంతో పాటు ఈదురుగాలులతో తెగిపడిన కేబుల్ వైరు నడిరోడ్డుపై పడిపోయింది. స్థానికులు చూసి చుట్టగా ఒక దగ్గరికి వేసి వదిలేశారు. రోడ్డుపై ఇంటర్నెట్ కేబుల్ వైరు చుట్టగా ఉండడంతో రాత్రి సమయంలో గమనించినక ద్విచక్ర వహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ సిబ్బంది మాత్రం తమ శాఖకు చెందిన ఇంటర్నెట్ కేబుల్ వైర్ తెగిపడినా పట్టించుకోవడంలేదు. వెంటనే అధికారులు స్పందించి కేబుల్‌వైర్‌ను రోడ్డుపై నుంచి తొలగించాలని వహనదారులు కోరుతున్నారు.



నడిరోడ్డుపై కేబుల్‌వైర్

గుట్టల్లో కుళ్లిన మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రామాయంపేట(మెదక్): పట్టణ శివారులోని గుట్టల్లో పూర్తిగా కుళ్లిపోయిన గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు కనుగొన్నారు. అతని వయస్సు 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటుందని సుమారుగా రెండు నెలల క్రితమే గుట్టలపై మరణించి ఉంటాడని ఎస్‌ఐ రంజిత్ పేర్కొన్నారు. ఈ మేరకు డాక్టర్లు సంఘటనా స్థలిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

క్రీడాపోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు



వాలీబాల్ ఆడుతున్న క్యాడెట్లు

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్యాడెట్లు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా క్యాడెట్లుకు యోగా, కవాతు, ఫైరింగ్ సిములేటర్ ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్టతో పాటు బ్యాటిల్ క్రాఫ్ట్ వెపన్ ట్రెనింగ్ తరగతులను నిర్వహించినట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ మధుసూదన్‌రావు తెలిపారు. ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో, సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ విజయభాస్కర్, శంకరయ్య తెలిపారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): 25 ఏళ్లుగా రామకోటి రామరాజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జగదేవ్‌పూర్ వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ జగదేవ్‌పూర్ వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు తాను చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. జగదేవ్‌పూర్ గ్రామస్తులు కల్యాణానికి గోటి తలంబ్రాలు అందజేశారని గుర్తు చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264